క్లుప్తంగా

బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా శివరాజ్



మహబూబాబాద్ అర్బన్: బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్పీ) మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నెల్లికుదురు మండలం శ్రీరామగిరికి చెందిన దార్ల శివరాజ్‌ను నియామించిన్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ మంగళవారం తెలిపాడు. ప్రస్తుతం బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న తనకు పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించిన అధ్యక్షులు మంద ప్రభాకర్, రాష్ట్ర కోఆర్డినేటర్ మంతాపరం బాలయ్యకు కృతజ్ఞతలు తెలిపాడు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



చిన్నగూడూరు: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరగుతున్నట్లు ఎంఈఓ పూల్‌చంద్ తెలిపాడు. మంగళవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పేపర్‌కు 189 మంది విద్యార్థులకు 188 మంది పరీక్షకు హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నాడు. విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించినట్లు తెలిపారు. పరీక్ష సెంటర్ వద్ద 144వ సెక్షన్ అమలులో ఉందని పేర్కొన్నారు.

తనిఖీలు ముమ్మరం



దోర్నకల్: మండలంలోని పలు రహదారుల్లో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. వాహనాలను నిలిపి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తూ వీడియో రికార్డ్ చేస్తున్నారు.

రేపు టీడబ్ల్యూజేఎఫ్ మహాసభ

నెహ్రూసెంటర్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సమాఖ్య (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా ద్వితీయ మహాసభ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఈనెల 28న నిర్వహిస్తున్నామని సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు మంగళవారం తెలిపాడు. ఈ మహాసభకు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నారని, యూనియన్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

నీరు విడుదల



దంతాలపల్లి: మండల కేంద్రం శివారులో డీబీఎం60 ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ షెటర్ ఎత్తి నీరు కిందికి విడుదల చేసినట్లు ఏఈ మౌనిక మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోమవారం రాత్రి గుర్తు తెలియని కొంతమంది రైతులు షెటర్ కిందికి దించారన్నారు. ఈ కాల్వ ద్వారా నీరు దంతాలపల్లి, నర్సింహులపేట, మరిపెడ మండలాలకు వెళ్తాయన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులు



దోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లో పోస్టాఫీసు ద్వారా పింఛన్లు పొందుతున్న వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడం, పోస్టాఫీసుల్లో తాగునీరు, టాయిలెట్లు, బెంచీలు లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొల్లచర్ల పోస్టాఫీసులో ప్రతీ నెలా 500 మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్లు తీసుకుంటారు. ఇక్కడ ఎలాంటి వసతులు లేక వృద్ధులు, దివ్యాంగులు క్యూలో ఉండలేక నానా పాట్లు పడుతున్నారు.

మిశ్రమ పంటలు.. ఆదాయం నాలుగింతలు

- పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ
- ఎకరంలో పలురకాల ఆకు, కూరగాయల సాగు



సాగు చేసిన పంటలో రైతు అనూష



సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారి రాకేష్

పెద్దవంగర: మార్కెట్‌లో కూరగాయల డిమాండ్‌ను గుర్తించిన రైతులు మిశ్రమ పంటలు సాగు చేస్తున్నారు. లాభం ఆర్జించడంతోపాటు వినియోగదారులకు కొరత తీరుస్తున్నారు. మండే వేసవిలో సైతం కూరగాయల సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కొన్నేళ్లుగా ఆకుకూరలు పండిస్తూ.. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. పండించిన వాటిని తొర్రూరు డివిజన్ కేంద్రంలో విక్రయిస్తున్నారు.

పెద్దవంగర మండలంలో మామిడి 953, ఆయిల్‌పాం 168 ఎకరాలు, పండ్ల తోటలు 148, మిర్చి 384, కూరగాయలు 46 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కాగా మండలం రామచంద్రు తండాకు చెందిన పానుగోతు అనూష తన ఎకరం భూమిలో కూరగాయల పంటలు వంకాయ, సోర, కాకర, బుడంకాయ, బెండ, టమాటతోపాటు ఆకు కూరలు పాలకూర, కొత్తిమీర, చుక్కకూర, తోటకూర, మెంతికూరలు సాగు చేసింది. ఇందుకుగాను విత్తనాలకు రూ.10వేలు, క్రిమి సంహారక మందు, ఎరువులకు రూ.20 వేలు ఖర్చు వచ్చింది. కలుపు, తడులు కట్టడం తనే చూసుకుంటుంది. ఇప్పటి వరకు పది కోతలు కోయగా ప్రతి కోతకు రూ.12వేల చొప్పున ఆదాయం సమకూరింది. మరో ఆరు కోతల వరకు వచ్చే అవకాశం ఉంది. వాటికి గాను రూ.80వేల వరకు ఆదాయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నీటి వసతి ఉంటే మరో నాలుగు కోతలు వచ్చేవని చెబుతుంది. మార్కెట్‌లో కూరగాయలు రెట్టింపు ధరలు పలకడంతో మరింత లాభం వస్తోందని ఆమె పేర్కొంటుంది.

రాయితీపై విత్తనాలు అందించాలి



కూరగాయలు సాగుచేసే రైతులకు హార్టికల్చర్ శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు అందించాలి. దీంతో రైతులకు ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలి. కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది.

- పానుగోతు అనూష, మహిళా రైతు, రామచంద్రుతండా

అవగాహన కల్పిస్తున్నాం..



కూరగాయలు, పండ్ల తోటలను ప్రోత్సహించేందుకు రైతులకు ఎప్పటికప్పుడు మెళకువలు చెబుతున్నాం. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. సలహాలు సూచనలు ఇస్తూ కూరగాయల సాగు మరింత పెంచేందుకు తోడ్పాటు అందిస్తున్నాం.

- రాకేష్, హార్టికల్చర్‌శాఖ అధికారి

చర్చి కూల్చివేత విచారకరం



కూల్చిన చర్చిని పరిశీలిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్: పాస్టర్ పండరీనాథ్ చర్చిని ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే కూల్చివేయడం విచారకరమని ఎంసీవైఎఫ్ సెక్రటరీ జన్ను మహేందర్ అన్నారు. పట్టణంలోని కవితకాలనీలోగల పాస్టర్ పండరీనాథ్ చర్చిని కూల్చివేసిన సంఘటన స్థలాన్ని ఎంసీవైఎఫ్ నాయకులు మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వర్తించుకునే మట్టల ఆదివారం, ఈస్టర్ పండుగ అని చూడకుండా పోలీసుల సహకారంతో తహసీల్దార్ చర్చిని కూల్చివేయించారని పేర్కొన్నాడు. కలెక్టర్ స్పందించి క్రైస్తవుల హక్కులకు ఏ విధమైన భంగం కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్ వెస్లీ, జాన్ ప్రభాకర్, లాల్ సింగ్ నాయక్, బొబ్బిలి వినోద్, ప్రభుచరణ్, డేవిడ్, మహేష్, పత్తి పాల్, ఎంసీవైఎఫ్ అధ్యక్షుడు చాగంటి కరుణాకర్, ట్రెజరర్ నాగరాజ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నెహ్రూసెంటర్: అసెంబ్లీ ఎన్నికల వేళ, మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికరంగ సమస్యల పరిష్కారానికి చర్య తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సీఐటీయూ ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉత్పత్తిని పెంచి సంపదను సృష్టిస్తున్న కార్మికవర్గంపై రాష్ట్ర ప్రభుత్వం కార్మిక పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశాడు. విద్య, వైద్యం, మున్సిపల్, స్థానిక సంస్థలు, రవాణా తదితర రంగాల్లో సేవలు అందిస్తూ సమస్యలతో సతమతమవుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు గ్యారెంటీ ఇస్తుందని ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు పి.రాజారావు, ఎస్వీ.రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, నాయకులు రాజమౌళి, శ్రీనివాస్, నాగన్న, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల అభివృద్ధి చూసి చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వంద రోజుల అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు 150 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించాడు. మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు చిట్టి వెంకన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 110రోజుల్లోనే రూ.10లక్షల సీసీరోడ్డు, రూ.2లక్షలతో మంచినీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపాడు. దుబ్బగూడెం గ్రామ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. పెద్దలకుంటలో రూ.50లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు, త్వరలోనే పైపులైను పనులు మొదలు పెడతామన్నాడు. ఆర్అండ్‌బీ రోడ్డు కోసం 14కిలోమీటర్లకు రూ.22కోట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మంజూరు చేసినట్లు పేర్కొన్నాడు. రానున్న ఎంపీ ఎన్నికల్లో ఎలాంటి వర్గవిబేధాలు లేకుండా కలిసికట్టుగా పని చేసి మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు మాదవ పెద్ది రమేష్ చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్ రెడ్డి, బొల్లికొండ మధుగౌడ్, కొమ్మాలు, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

కేసముద్రం: మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ ఎండీ అజీమ్‌ఖాన్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే మురళీనాయక్ బాధిత కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే విధంగా చర్య తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు దస్రు నాయక్, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, వెంకన్న, ఆయూబ్ ఖాన్, శ్రీనివాస్, విరేష్ పాల్గొన్నారు.

నన్ను చితక బాదారు..

- సోషల్ మీడియాలో ఫొటోలతో పోస్ట్ వైరల్
- ఎవరినీ కొట్టలేదు.. అతనో రౌడీషీటర్ : సీఐ

నర్సింహులపేట: తనను అకారణంగా ఎస్సై చితక బాదాడని మండలంలోని నర్సింహాపురం బంజరకు చెందిన మేరకబోయిన నాగేశ్వర్ అనే వ్యక్తి మంగళవారం సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరలైంది. తనను ఈ నెల 15న స్టేషన్‌లో లాకప్‌లో వేసి విచక్షణారహితంగా ఎస్ఐ కొట్టాడని, 16న ఆస్పత్రి అడ్మిట్ అయి చికిత్స పొందినట్లు నాగేశ్వర్.. తన ఒంటిపై దెబ్బలతో ఉన్న ఫొటోలతో పోస్టు పెట్టాడు. దీనిపై తొర్రూరు సీఐ సంజీవ స్పందించి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన రౌడీషీటర్ నాగేశ్వర్‌పై కేసు నమోదు చేశామని, అతడిని కొట్టలేదని తెలిపారు. ఇతనిపై గతంలో 3 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయని, ఇతను, ఇతని తమ్ముడు బ్రమేష్ విలేకరినంటూ బెదిరిస్తూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. బ్రమేష్‌పై 3 ఇసుక అక్రమ రవాణా కేసులు ఉన్నాయని, 16న వీరు ఇద్దరు వారి ట్రాక్టర్‌పై ఇసుక రవాణా చేస్తుండగా పెట్రోలింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ రమేష్ అప్ పర్మిషన్ ఉందా అని అడిగితే.. తిరిగి కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేశారని వివరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. పోలీసులు కొట్టినట్లు, థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు సోషల్‌మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాడని తెలిపారు.

కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

దంతాలపల్లి: కులవృత్తే జీవనాధారంగా చేసుకొని చాలీచాలని సంపాదనతో కుటుంబాలను నెట్టుకువస్తున్న కుమ్మరుల జీవితాలను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కుమ్మరి సంఘం మండల నాయకుడు సెగ్గం గణేష్ ప్రభుత్వాన్ని వేడుకున్నాడు. మంగళవారం ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే అన్ని కులవృతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ చెప్పినట్లు గుర్తుచేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

మహబూబాబాద్ అర్బన్: సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సైబర్ క్రైం సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వ్యక్తిగత బ్యాంకింగ్ విషయాలను అపరిచితులతో పంచుకోవద్దని, సెల్‌ఫోన్‌లో ఓటీపీలు, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయాలని వచ్చే మేసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930, 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు శివకుమార్, కరుణాకర్, పోలీస్ సిబ్బంది రవి, నరేష్, అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జలాభిషేకం, కుంకుమ పూజలు



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

గార్ల: మండలంలోని గోపాలపురం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం శీతల పరమేశ్వరీ విగ్రహానికి మహిళలు బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం మహిళలు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కుంకుమ పూజలు నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠ సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తుల ఇళ్లకు బంధువుల రాకతో గ్రామం జనంతో కిటకిటలాడింది. నేడు 11గంటలకు బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు అర్చకుడు శ్రీరామశాస్త్రి తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



నిందితులను చూపుతున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్, కురవి మండలాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.నీరజ మంగళవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజనరావు ఆదేశాల మేరకు, మానుకోట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్ ఆధ్వర్యంలో జరిపిన దాడుల్లో 5గురు వ్యక్తుల నుంచి 42లీటర్ల గుడుంబా, 200 కేజీల నల్లబెల్లం, 13కేజీల పటిక స్వాధీన చేసుకొని, 5 ద్విచక్రవాహనాలను సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై కిరీటి, సిబ్బంది వెంకన్న, నరసింహారావు, శ్రీను, జ్యోతి, ఉమేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

కేసముద్రం: కేసముద్రం విలేజ్‌కు చెందిన కొండ నాగయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈమేరకు స్పందించిన కేసముద్రం సేషన్ జెడ్పీఎస్ఎస్ 2002-03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం తోటి మిత్రుడికి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అశోక్, స్టాలిన్, మహేందర్, సంపత్, వాల్య, నాగేద్రబాబు, బాలు పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో..

ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన వీరన్న అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం ఇనుగుర్తి హైస్కూల్‌కు చెందిన 2002-03 పదో తరగతి విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.14వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రజినీకాంత్, వెంకన్న, సునీల్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

కేసముద్రం విలేజ్‌లో..

కేసముద్రం విలేజ్‌లో బొల్లోజు రాజేష్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈమేరకు బాధిత కుటుంబానికి అంతర్యామి సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.8వేలు అందజేశారు.

అనంతాద్రిలో వైభవంగా చక్రస్నానం



అభిషేకాలు చేస్తున్న అర్చకులు

మహబూబాబాద్ రూరల్: అనంతాద్రి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జగన్నాథ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో మహాసుదర్శన యాగం పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సూకల రామచంద్రారెడ్డి, జ్యోతి దంపతులు, సౌమిత్రి హేమంత్ ఆచార్యుల యాజ్ఞిక నిర్వహణలో ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు, శ్రవణ్‌కుమారాచార్యులు, సహ అర్చకులు అమ్మవార్లు, స్వామివారికి పూజలు చేశారు. చతుస్థానార్చన, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నానం కార్యక్రమాన్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. మొదటగా భూనీలా సమేత వేంకటేశ్వరస్వామివారికి పంచామృత అభిషేకాలు చేశారు. మంగళవాయిద్యాలతో స్వామివారు, అమ్మవార్లను ఆలయంలోకి తీసుకెళ్లారు. మహాకుంభప్రోక్షణ నిర్వహించి భక్తులకు ఆలయ రాజగోపురంపై పూజల ద్వారా ప్రసాదాలను బహూకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గల కోనేరులో వసంతోత్సవం కనుల పండువగా జరిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి: సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మూడ్ బాలుచౌహాన్ తండ్రి మూడ్ లక్ష్మణ్‌నాయక్(80) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని తాళ్లసంకీస శివారు వస్రాం తండాకు తీసుకరాగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ దంపతులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, నంగారభేరి రాష్ట్ర కోకన్వీనర్ గుగులోత్ బీమానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారావత్ వెంకన్న, జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్ పాల్గొన్నారు.

గుడుంబాను అరికట్టాలని వినతి

గార్ల/దోర్నకల్: గార్ల మండలంలోని బుద్దారం తండాలో విచ్చలవిడిగా లభ్యమవుతున్న గుడుంబాను అరికట్టాలని కోరుతూ మంగళవారం దాసరి నాని స్థానిక ఎస్సై ఎస్.జీనత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుద్దారంతండాకు ఆనుకొని ఉన్న దోర్నకల్ గ్రామానికి చెందిన అనేక మంది గుడుంబాకు బానిసై వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నాడు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి గ్రామంలో గుడుంబాను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ముగ్గురిపై కేసు నమోదు

గార్ల: బాలికను ప్రేమ పేరుతో వేదిస్తున్నాడనే కోపంతో బాలిక తల్లితండ్రులు యువకుడిపై దాడి చేసిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ మంగళవారం తెలిపాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం పెద్దకిష్టాపురం పంచాయతీ చంద్రగిరి గ్రామానికి చెందిన భూక్యా రమేష్ అదే గ్రామానికి చెందిన బాలికను వేదించిన కేసులో 2నెలల క్రితం పోక్సో కేసు నమోదైంది. వారం రోజుల క్రితం జైలు నుంచి వచ్చిన రమేష్ బైక్‌పై వెళ్తుండగా, బాలిక తల్లితండ్రులు గంగావత్ మల్సూరు, సునీత, మరో వ్యక్తి మంగీలాల్ కలిసి కోపంతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

యువకుడిపై పోక్సో కేసు ..

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఓ తండాకు చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని ఓ తండాకు చెందిన బాలిక బడికి వెళ్లి వస్తున్న సమయంలో ఇబ్బందులకు గురిచేస్తూ.. సోషల్ మీడియాలో ఆమె ఫొటోలను అసభ్యకరంగా పోస్టులు పెట్టాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి సరుకుల అందజేత



కేసముద్రం: కేసముద్రం విలేజ్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే కేసముద్రం విలేజ్‌కు చెందిన బెజ్జం వెంకన్న మృతి చెందగా బాధిత కుటుంబానికి 2005-06 బ్యాచ్ విద్యార్థులు 50కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కుమార్, రాము, అశోక్, తదితరులు పాల్గొన్నారు.